నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, సోమవారం 2 డిసెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

రక్త పరీక్షల కోసం క్యూలో నిల్చున్న రోగులు (ఫైల్)

శీతాకాలం వ్యాధుల భయం

- చిన్నారులు, వృద్ధులకు జలుబు, దగ్గు, జ్వరం
- రోగులతో కిక్కిరిసిపోతున్న ఆసుపత్రులు

చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులు (ఫైల్)

తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు..

- రోగ నిరోధక శక్తి పెంపొందించుకునేందుకు వ్యాయామం, నకడ తప్పనిసరి.
- ప్రతి రోజూ గోరు వెచ్చని నీటినే తాగాలి.
- ఆవిరి పడుతూ శ్వాస నాళాలు శుభ్రం చేసుకోవాలి.
- విటమిన్ 'సీ' తో కూడిన ఆహారం, పండ్లు తీసుకోవాలి.
- పాలు, పప్పులు, కూరగాయల వినియోగం పెంచాలి.
- వృద్ధులు ఎక్కువ విశ్రాంతి తీసుకోవాలి. తగినంత నిద్రపోవాలి.
- వృద్ధులు, చిన్నారులు ఉన్ని దుస్తులు ధరించేలా చూడాలి.
- చేతులు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.
- మాస్కులు ధరిస్తే మరింత మంచిది.
- చల్లని వాతావరణంలో వృద్ధులు, పిల్లలను తిరగకుండా చూడాలి.

అశ్వారావుపేట, డిసెంబర్ 1: శీతాకాలం మొదలైన వేళ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మొన్నటి వరకూ పగటి వేళ ఎండలు దంచి కొట్టగా.. ఇప్పుడు రాత్రి వేళ చలి తీవ్రత అమాంతం పెరిగింది. దీనికి ఇటీవలి ఫెంగల్ తుపాను తోడైంది. అయితే శీతాకాలం తొలినాళ్లలోనే చలి తీవ్రత ఒక్కసారిగా పెరడంతో దాని ప్రభావం చిన్నారులు, వృద్ధులపై పడుతోంది. దీంతో వారు జలుబు, దగ్గు, జ్వరం భారిన పడుతున్నారు. మధ్య వయస్కులకు కూడా సుస్తీ చేస్తుండడంతో శీతాకాలం వ్యాధుల భయం మొదలైన సంకేతాలనిస్తున్నాయి. ఆసుపత్రులకు రోగుల సంఖ్య పెరుగుతుండడమే ఇందుకు నిదర్శనంగా కన్పిస్తోంది.

చలి తీవ్రత పెరగడంతో శ్వాస సంబంధిత సమస్యలతో అధిక మంది రోగులు ఆసుపత్రులకు వస్తున్నారు. అయితే ఈ కాలంలో చిన్నారుల్లో ముఖ్యంగా ఊపిరితిత్తుల సమస్యలు ఉత్పన్నమై న్యుమోనియా లక్షణాలు కన్పిస్తున్నాయంటూ వైద్యులు చెబుతున్నారు. జలుబు, దగ్గు, ఆస్తమా, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్, గుండె సంబంధిత సమస్యలు, కీళ్ల నొప్పులు, శరీరంలోని అన్ని అవయవాలకు రక్త ప్రసరణ తగ్గడం వంటి లక్షణాలున్న రోగులు అధికంగా వస్తున్నట్లు వివరిస్తున్నారు. చలి తీవ్రతను తాళలేని చిన్న పిల్లలు, వృద్ధులపై ఇలాంటి వ్యాధుల ప్రభావం అధికంగా ఉందని వారు చెబుతున్నారు. అయితే ఇలాంటి సీజన్‌లో ఆరోగ్య జాగ్రత్తలు తప్పక పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

పెరుగుతున్న రోగుల సంఖ్య..

జిల్లాలో చల్లటి వాతావరణం పెరగడంతో సంబంధిత వ్యాధులు విజృంభిస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల నమోదును పరిశీలిస్తే తీవ్రత అర్థమవుతోంది. నిరుటితో పోల్చితే ఈ ఏడాది గడిచిన నెలల్లో రోగుల సంఖ్య రెండింతలు పెరిగింది. ఒక్క ప్రభుత్వ ఆసుపత్రిలోనే అక్టోబర్‌లో జ్వర పీడితుల సంఖ్య 131 మంది కాగా నవంబర్‌లో 100 మందికి పైగా దాటిపోయారు. అలాగే దగ్గుతో అక్టోబర్ నెలలో 315 మంది, నవంబర్‌లో 465 మంది, బలుబుతో అక్టోబర్‌లో 210 మంది నవంబర్‌లో 165 మంది రోగులు నమోదయ్యారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి..

వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల నుంచి రక్షణ కోసం ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి. చలి ప్రదేశాల్లో ఎక్కువగా తిరగకూడదు. చిన్నారులు, వృద్ధుల్లో శ్వాస సంబంధిత వ్యాధులు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉంటుంది. అలాంటి అనారోగ్య సమస్యలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. సాధారణ జలుబు, జ్వరం అంటూ సొంత వైద్యం చేసుకోకూడదు. చల్లటి గాలి ముక్కులోకి వెళ్లకుండా మాస్కులు ధరిస్తే మంచిది. రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారం తీసుకోవాలి.

–కే.రాధా రుక్మిణి, ఆసుపత్రి సూపరింటెండెంట్, అశ్వారావుపేట

లక్ష్మీనగరంలోని ఏకలవ్య వసతిగృహ విద్యార్థులతో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్ఎస్ నేతలు రాకేశ్‌రెడ్డి, రేగా కాంతారావు

భోజనం నాణ్యంగా ఉండట్లేదని..
విద్యార్థులే చెబుతున్నారు

- సౌకర్యాలూ మెరుగ్గా లేవని బాధపడుతున్నారు
- విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోంది
- అయినా పిల్లలపై వార్డెన్లు, హెచ్ఎంలు శ్రద్ధ తీసుకోవాలి
- గత కేసీఆర్ ప్రభుత్వ పాలనలోనే మెరుగైన వసతులు
- వసతిగృహాల సందర్శనలో తాతా, రేగా, రాకేశ్‌రెడ్డి

లక్ష్మీనగరంలోని ఏకలవ్య పాఠశాల వసతిగృహంలో భోజనాన్ని పరిశీలిస్తున్న రాకేశ్‌రెడ్డి, రేగా

దుమ్ముగూడెం, డిసెంబర్ 1: వసతిగృహాల్లో నాణ్యమైన భోజనం అందించడం లేదంటూ స్వయంగా విద్యార్థులే చెబుతున్నారని ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్ఎస్ రాష్ట్ర నేత రాకేశ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆవేదన వ్యక్తం చేశారు. వసతులు, సౌకర్యాలు కూడా మెరుగ్గా లేవని వారు బాధపడుతున్నారని అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో నాణ్యమైన భోజనం, విద్య అందాయని గుర్తుచేశారు. వసతిగృహాల సందర్శనలో భాగంగా ఆదివారం సాయంత్రం దుమ్ముగూడెం మండలానికి చేరుకున్న వారు.. తొలుత లక్ష్మీనగరంలో వసతిగృహాలను పరిశీలించారు. వంటశాల, తరగతి గదులు, వసతిగృహాల పరిసరాలను గమనించారు. వసతిగృహాల్లో సౌకర్యాలు ఎలా ఉన్నాయంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏకలవ్య పాఠశాలను పరిశీలించారు. లేబొరేటరీలు లేవంటూ అక్కడి ఉపాధ్యాయులు బీఆర్ఎస్ నేతల దృష్టికి తీసుకొచ్చారు. తరువాత సీతారాంపురంలోని ఏకలవ్య పాఠశాలను కూడా పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పాఠశాల నిర్మాణ పనులు చూశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. నాణ్యమైన భోజనం, మెరుగైన వసతులు కల్పించకుండా వారి జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని ధ్వజమెత్తారు. సర్కారు నిర్లక్ష్యంగా ఉంటున్నప్పటికీ విద్యార్థుల పట్ల వార్డెన్లు, హెచ్ఎంలు శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా వారి ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. వసతిగృహాలపైనా, హాస్టళ్ల విద్యార్థులపైనా ప్రభుత్వం కూడా నిర్లక్ష్యాన్ని వీడాలని డిమాండ్ చేశారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో వసతిగృహాల పర్యవేక్షణ అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టళ్లతో తమకు నాణ్యమైన భోజనం అందడం లేదంటూ స్వయంగా విద్యార్థులు చెబుతుండడమే ఇందుకు నిదర్శనమని స్పష్టం చేశారు. తాము పరిశీలించిన అన్ని హాస్టళ్లలో విద్యార్థులు ఇదే విషయాన్ని తమ దృష్టికి తీసుకొచ్చారని వివరించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో గురుకులాలు, వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, సకల సదుపాయాలు అందేవని గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు మానే రామకృష్ణ, మండల కన్వీనర్ కణితి రాముడు, కో కన్వీనర్ జానీపాషా, కొత్తూరు సీతారామారావు, బొల్లి వెంకట్రావు, కలువ పూర్ణయ్య, దామెర్ల శ్రీనివాస్, లంకా శివ, కొత్తా మల్లేశ్వరరావు, భూపతి రావు, తంతరపల్లి వెంకటేశ్వరరావు, జుంజునూరి జయసింహ, గంగరాజు, చందు, నాగేశ్వరరావు, సూర్య, రాము, రాంబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు సమాధి కడదాం

- ఇచ్చిన హామీలను రేవంత్ సర్కారు తుంగలో తొక్కింది
- పార్టీ మారిన నాయకులకు పరాభవం తప్పదు
- భద్రాచలం ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గెలుపు ఖాయం
- బీఆర్ఎస్ చర్ల మండల విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధు
- 'స్థానికం'లో శ్రేణులు శ్రమించాలి: రాకేశ్‌రెడ్డి, రేగా

బీఆర్ఎస్ చర్ల మండల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు, చిత్రంలో రాకేశ్‌రెడ్డి, రేగా కాంతారావు

చర్ల, డిసెంబర్ 1: ఆరు గ్యారెంటీలను విస్మరించి ప్రజలను మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సమాధి కడదామని ఎమ్మెల్సీ తాతా మధు పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను రేవంత్ సర్కారు తుంగలో తొక్కిందని విమర్శించారు. బీఆర్ఎస్ మండలం కన్వీనర్ దొడ్డి తాతారావు అధ్యక్షతన చర్లలో ఆదివారం నిర్వహించిన పార్టీ మండలస్థాయి విస్తృతస్థాయి సమావేశంలో తాతా మధు మాట్లాడారు. స్వార్థంతో పార్టీకి వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో చేరిన వారికి పరాభవం తప్పదని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులు ఎంతో అభిమానంతో అహర్నిశలూ శ్రమించి ఇక్కడి బీఆర్ఎస్ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించారని అన్నారు. కానీ ఆ ఎమ్మెల్యే ఈ ప్రజలందరినీ మోసం చేసి కాంగ్రెస్‌లో చేరాడని దుయ్యబట్టారు. భద్రాచలం నియోజకవర్గానికి కచ్చితంగా ఉప ఎన్నిక వస్తుందని, అప్పుడు కూడా బీఆర్ఎస్ గెలుపు ఖాయమవుతుందని స్పష్టం చేశారు. ప్రజలు కూడా బీఆర్ఎస్‌ని గెలిపించి.. పార్టీ మారిన వారికి, చేర్చుకున్న వారికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని, సంక్షేమాన్ని పక్కకు పెట్టి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిందని ధ్వజమెత్తారు. ఇదే సమయంలో ప్రజలందరూ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీతో రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు శ్రమించాలని పిలుపునిచ్చారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయలేని కాంగ్రెస్ పాలకులను నిలదీసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పోలీసులు లేకుండా వారు ప్రజల్లో తిరగలేని పరిస్థితి ఏర్పడిందని, ప్రజా తిరుగుబాటు అంటే ఏంటో వారికి ఇప్పుడు అర్థమవుతోందని దుయ్యబట్టారు. సమావేశంలో పార్టీ నేతలు మానే రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతస్థాయి సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

- ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- 2కే రన్‌లో ప్రారంభంలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్

బహుమతుల కోసం కాకుండా..
ఇష్టంతో ఆడుదాం

2కే రన్‌ను ప్రారంభిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఆటలను బహుమతుల కోసం కాకుండా ఇష్టంతో ఆడుదామని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. మనమంద రమూ బాల్యంలో ఇలాగే ఆడేవాళ్లమని గుర్తుచేశారు. బాల్యంలో తనకు ఆటలపై అమితాసక్తి ఉండేదని వివరించారు. డిసెంబర్ 1 నుంచి 9 వరకు నిర్వహిస్తున్న ప్రజా విజయోత్సవాల సందర్భంగా భద్రాద్రి జిల్లా కేంద్రంలో మొదటి రోజు ఆదివారం 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగూడెంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్ నుంచి రామచంద్ర డిగ్రీ కాలేజీ వరకు యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2కే రన్‌ను కలెక్టర్ జితేశ్ ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు, యువకులు, విద్యార్థులకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకే ఈ 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఇలాంటి పరుగులు పెట్టడం వల్ల యువతీ యువకులకు, ముఖ్యంగా వృద్ధులకు అత్యంత సహాయకరంగా ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరికీ ఉదయం పూట నడక, రన్నింగ్ వంటివి ఎంతో అవసరమని అన్నారు. డీవైఎస్‌వో పరంధామరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, వివిధ అసోసియేషన్ల సభ్యులు, యువతీ యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతన్నల్లో గుబులు

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తుపాన్ ప్రభావం
- బూర్గంపహాడ్, వైరా వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యం

బూర్గంపహాడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు వద్ద తడిసిన ధాన్యం

అశ్వారావుపేట టౌన్/ చండ్రుగొండ/ బూర్గంపహాడ్/ వైరా టౌన్, డిసెంబర్ 1: బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను ప్రభావంతో ఆదివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అక్కడక్కడ మోస్తరు వర్షం కురిసింది. పంటలు చేతికొచ్చే సమయంలో వానలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట కలాల్లో ఉన్న వరి ధాన్యాన్ని తడవకుండా పట్టాలతో కప్పారు. మరో రెండ్రోజులపాటు వానలు ఉన్నాయనే వాతావరణశాఖ హెచ్చరికలు రైతులను కలవరపెడుతున్నది. కాగా, ఆదివారం కురిసిన వర్షం కారణంగా బూర్గంపహాడ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు ఆరబోసిన ధాన్యం కొంత మేరకు తడిచింది. కొందరు రైతులు వారి వద్ద ఉన్న పరదాలను కప్పగా మరికొంతమంది రైతులు వాటిని కప్పే సమయానికి ధాన్యం రాశులు తడిచిపోయాయి. మార్కెట్‌యార్డులో వసతి సౌకర్యాలు కల్పించకపోవడంతోనే ఇలా జరిగిందని రైతులు మండిపడుతున్నారు. వైరా వ్యవసాయ మార్కెట్‌లోనూ ధాన్యం తడిచిపోయింది. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాలు, వ్యవసాయ మార్కెట్‌లో కనీస ఏర్పాట్లు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. వైరా మార్కెట్‌లో ధాన్యం రైతుల ఇబ్బందులను తెలంగాణ రైతు సంఘం బృంద సభ్యులు పరిశీలించారు.

అశ్వారావుపేటలో..

చండ్రుగొండలో..

అశ్వారావుపేట టౌన్: ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పుతున్న రైతులు

వైరా టౌన్: తడిసిన ధాన్యం వద్ద నేతలు

'పెదవాగు' భూముల ఆక్రమణపై..
భగ్గుమన్న ఆయకట్టు రైతులు

- లోతట్టు భూములను ఆంధ్రా రైతులు సాగుచేస్తున్నారంటూ మండిపాటు
- అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం
- మంత్రులు ఆదేశించినా నివారణ చర్యలు శూన్యమంటూ సీరియస్
- ప్రత్యేక కథనంలో ఈనెల 10నే హెచ్చరించిన 'నమస్తే తెలంగాణ'

గుమ్మడవల్లిలో రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న ఆయకట్టు రైతులు

అశ్వారావుపేట రూరల్, డిసెంబర్ 1: అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి సమీపంలోని పెదవాగు ప్రాజెక్టు లోతట్టు భూములు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వేలేరుపాడు – అశ్వారావుపేట ప్రధాన రహదారిపై ఆదివారం బైఠాయించారు. నీటిపారుదలశాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్రమణకు గురైన భూములను కాపాడాలని గుమ్మడవల్లి, కొత్తూరు, రంగాపురం గ్రామాలకు చెందిన పెదవాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతులు నినాదాలు చేస్తూ బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూలై 18న కురిసిన భారీ వర్షానికి పెదవాగు ప్రాజెక్టు గండిపడిందని అన్నారు. నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రాజెక్టుకు గండిపడిందంటూ ఆ సమయంలో పర్యటనకు వచ్చిన మంత్రులు తుమ్మల, పొంగులేటిలకు తాము ఫిర్యాదు చేశామని గుర్తుచేశారు. లోతట్టు భూముల ఆక్రమణలపైనా తాము ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అయితే కబ్జాదారులపై చర్యలు తీసుకొని భూమిని కాపాడాలని అధికారులను మంత్రులు ఆదేశించినట్లు చెప్పారు. అయినప్పటికీ మంత్రుల ఆదేశాలపై చర్యలు శున్యమని ఆరోపించారు. గండిపడి నీరులేక ప్రాజెక్టు నిరుపయోగంగా మారిందని అన్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు ఆంధ్రా రైతులు లోతట్టు భూముల్లో పొగాకు, నువ్వులు సాగు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టులో పూడిక పేరుకుపోతే నీరు ఎక్కువగా నిల్వ ఉండదని, అలాగే ప్రాజెక్టు శిథిలమైతే దాని ఆయకట్టు రైతులమైన తాల జీవితాలు నాశమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవం లేదని, భూములతో తమ శాఖకు సంబంధం లేదని అంటున్నారని, రెవెన్యూ అధికారులకు చెప్పాలంటూ సలహాలు ఇస్తున్నారని మండిపడ్డారు. ఈ రెండు శాఖల అధికారులూ కలిసి తమ జీవితాలతో చెలగాటమడుతున్నారని ఆరోపించారు. ఐదేళ్ల క్రితమే తాము ఫిర్యాదు చేసినప్పుడు ఐబీ అధికారులు స్పందించి ఉంటే ప్రాజెక్టుకు గండి పడేది కాదని అన్నారు. అప్పుడు ఆ అధికారులు చర్యలు తీసుకొని ఉంటే ప్రాజెక్టు కొట్టుకపోయేది కాదని, తాము ఇంతలా నష్టపోయేవాళ్లమూ కాదని అన్నారు. ప్రాజెక్టులోని ఆక్రమణ భూములను కాపాడకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కాగా, రాస్తారోకో వద్దకు చేరుకున్న పోలీసులు.. ఆందోళనకారులతో చర్చించారు. ఆదివారం కావడం వల్ల ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ఉందని అని; ఐబీ, రెవెన్యూ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

ముందుగానే హెచ్చరించిన 'నమస్తే'

పెదవాగు ప్రాజెక్టు లోతట్టు ప్రాంత భూములను కొందరు ఆక్రమించి పొగాకు, నువ్వులు సహా ఇతర పంటలు సాగు చేస్తున్నారంటూ 'నమస్తే తెలంగాణ' ముందే హెచ్చరించింది. ఈ మేరకు 'కబ్జాల పంట' శీర్షికన గత నెల 10న ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోకపోతే ఆయకట్టు రైతులు ఉద్యమబాట పట్టనున్నారని ముందుగానే స్పష్టం చేసింది. ఈ క్రమంలో అధికారుల నిర్లక్ష్యంపై విసిగిపోయిన అన్నదాతలు.. ఆదివారం రాస్తారోకో చేశారు.